## తబూక్ యుద్ధ నేపథ్యంలో
## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 24.10.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. ఈ రోజు కూడా నేను తబూక్ (ఘజ్వా) యుద్ధ సంఘటనల మరిన్ని వివరాలను ప్రస్తావింతును.

జద్ బిన్ ఖైస్ అనే వ్యక్తి సంఘటన వివరించబడింది. ఇతను కూడా మునాఫిఖీన్ (దాంబికులలో) ఒక వ్యక్తి, అబ్దుల్లాహ్ బిన్ ఉబై తర్వాత దాంబికుల మరొక పెద్ద నాయకుడు. ఇతను హుదైబియా సంధి సమయంలో కూడా బైఅత్ చేయలేదు. ఇతను కూడా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి యుద్ధానికి వెళ్లకపోవడానికి సాకు చెప్పాడు. కథనం ప్రకారం అతను ఇలా అడిగాడని వ్రాయబడింది: "ఓ రసూలుల్లాహ్! నాకు అనుమతి ఇవ్వండి, నన్ను పీడనములో పడవేయకండి." "అల్లాహ్ సాక్షిగా! నా జాతికి నా గురించి బాగా తెలుసు, నా కంటే స్త్రీలను ఎక్కువగా కోరుకునే వ్యక్తి మరొకరు లేరు. నేను బనూ అస్ఫర్ అంటే రోమన్ల స్త్రీలను చూస్తే నేను సహనం కోల్పోతానేమో అని నేను భయపడుతున్నాను." దీనిపై రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ అసంబద్ధమైన సమాధానం విని అతన్ని నిర్లక్ష్యం చేసి ఇలా అన్నారు: "సరే, వెళ్ళు, నీకు అనుమతి ఉంది." అతని కొడుకు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జద్ రజియల్లాహు అన్హు, బద్రీ సహాబీ (అనుచరుడు), చాలా నిష్కపటమైన వ్యక్తి, ఈ మాటలన్నీ విని కోపగించుకుని ఇలా అన్నారు: "లేదు, అల్లాహ్ సాక్షిగా! ఇది కపటం, దీని కారణంగా మీరు యుద్ధానికి వెళ్ళడం లేదు. అల్లాహ్ సాక్షిగా! మీ గురించి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పై పవిత్ర ఖుర్ఆన్ ఖచ్చితంగా అవతరిస్తుంది." ఒక ఉల్లేఖనంలో జద్ బిన్ ఖైస్ గురించి ఈ సూక్తి అవతరించింది: "మరియు వారిలో అతను కూడా ఉన్నాడు, 'నాకు అనుమతి ఇవ్వండి మరియు నన్ను పీడనములో పడవేయకండి' అని అంటాడు." తరువాత కాలంలో అతను పశ్చాత్తాపపడి, మంచి పశ్చాత్తాపాన్ని చూపించాడని మరియు తరువాత హజ్రత్ ఉస్మాన్ రజియల్లాహు అన్హు ఖిలాఫత్ పాలన, సమయంలో మరణించాడని చెప్పబడింది.

మదీనాలో దాంబికులు, యూదులు తప్పుడు పుకార్లు వ్యాప్తి చేయడం ద్వారా ముస్లింల ధైర్య,

సాహసాలను దెబ్బతీయడానికి, ముస్లింలను యుద్ధానికి వెళ్ళకుండా ఆపడానికి తీవ్రంగా ప్రయత్నించేవారు, దీని కోసం వారు వివిధ రకాల వ్యూహాలను ఉపయోగించేవారు. వారు తమకంటూ ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ కేంద్రాన్ని అంతం చేయమని ఆదేశించారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన దయ, కరుణ కారణంగా ఆ ప్రజలను క్షమించేవారు, కానీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఏదైనా ప్రమాదకరమైన కుట్ర జరిగినప్పుడు, దానిని చాలా తెలివిగా, కఠినంగా అంతం చేయడానికి చర్యలు కూడా తీసుకునేవారు. వ్యవస్థకు వ్యతిరేకంగా ఏదైనా జరిగితే, కఠినంగా ఉండటం అవసరం, అక్కడ దయ చూపడానికి అవకాశం లేదు అనే ఈ ప్రాథమిక సూత్రాన్ని గుర్తుంచుకోవాలి. అందువల్ల, ఈ సందర్భంగా కూడా అలాంటి చర్య తీసుకోవడం జరిగింది, అయినప్పటికీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దయ, క్షమించుట ఆ సమయంలో చాలా గొప్పవిగా రుజువైనవి, ఆయన సల్లం వారిలో ఎవరినీ బంధించమని లేదా వారికి మరింత శిక్ష విధించమని ఆదేశించలేదు, కానీ కుట్రలకు స్థావరమైన అటువంటి ఆ ప్రధాన కార్యాలయాన్ని మాత్రం అంతం చేశారు.

తబూక్ యుద్ధ ప్రయాణానికి ప్రతి ఒక్కరూ సన్నాహాలలో నిమగ్నమై ఉండిరి, ప్రయాణ ఖర్చులను ఏర్పాటు చేయడానికి ఆర్థిక త్యాగాల ప్రక్రియ కూడా కొనసాగుతుండెను. పేద, అవసరమున్న అనుచరులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చినప్పుడు, సన్నాహాల కోసం వారికి సహాయం అందించబడింది. అదేవిధంగా, ధనవంతులైన వ్యక్తులు సవారీలు లేని అనుచరులకూ సవారీలను అందించేవారు. ఎందుకంటే సవారీ లేకుండా ఈ ప్రయాణం సాధ్యం కాకుండెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడా ఇలా ఆదేశించారు: “బలవంతుడు, ప్రయాణ కష్టాలను భరించగలవాడు, మరియు సవారీ, ప్రయాణ ఖర్చులు అందుబాటులో ఉన్న వ్యక్తి మాత్రమే మాతో పాటు వెళ్ళవలెను.”

ఈ సందర్భంగా కొంతమంది అనుచరులు ఏడుస్తూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చారు, వారు ఆయనను సవారీ కోసం అభ్యర్థించారు. వారు నిజంగానే అవసరమున్న అనుచరులు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. “నేను మిమ్మల్ని ఎక్కించి తీసుకెళ్ళగలిగే సవారీ లాంటిది నా వద్ద ఇప్పుడు ఏమీ లేదు. “ దానికి వారు ఏడుస్తూ తిరిగి వెళ్ళిపోయారు. ఆ అనుచరులు రజియల్లాహు అన్హుం నిష్కపటత, విధేయత, నిస్సహాయపు ఈ పరిస్థితిని అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా వివరించెను. “యుద్ధం ప్రకటించబడినప్పుడు నీవు వారికి ఏదైనా సవారీని అందించగలవని నీ వద్దకు వచ్చిన వారిపై కూడా ఎలాంటి నింద లేదు.” “అప్పుడు నీవు ఇలా సమాధానం ఇచ్చితివి. “నేను మిమ్మల్ని ఎక్కించి తీసుకెళ్ళగలిగే సవారీ లాంటిది నా వద్ద ఇప్పుడు ఏమీ లేదు. ఈ సమాధానం విని వారు తిరిగి వెళ్ళిపోయారు, అయ్యో! అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడానికి తమ వద్ద ఏమీ లేదనే ఈ దుఃఖంతో వారి కళ్ళ నుండి కన్నీళ్లు వస్తుండెను, ఇది తౌబా అధ్యాయంలోని సూక్తి. తరువాత ఈ అనుచరులకు ప్రయాణ ఖర్చులు అందుబాటులోకి వచ్చాయి.

కనుక వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి బయలుదేరారు. హ్రజత్ అబూ మూసా అల్ అష్అరీ రజియల్లాహు అన్హు తెగకు చెందిన ప్రజలు కూడా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో సవారీ కోసం అభ్యర్థించారు. వీరు ఆరుగురుండిరి. వీరు తమకు ప్రతినిధిగా ఆయనను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో పంపారు. వారితో కూడా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "నా వద్ద మీ అందరికీ ఇవ్వడానికి ఏమీ లేదు." దానిపై వారు ఏడుస్తూ అక్కడి నుండి తిరిగి వెళ్ళి పోయారు. కానీ అదే సమయంలో, ఆయన సల్లం హ్రజత్ సఅద్ బిన్ ఉబాదా రజియల్లాహు అన్హు దగ్గర ఒంటెలను కొనుగోలు చేసి, హ్రజత్ అబూ మూసా అష్రీ రజియల్లాహు అన్హును పిలిపించి ఇలా అన్నారు: "ఈ ఒంటెలను తీసుకువెళ్ళి, మీరు వాడుకోండి, మీ సహచరులకు ఇవ్వండి."

ఈ ఘజ్వాకు (యుద్ధానికి) వెళుతున్నప్పుడు మదీనాలో తాత్కాలికంగా ఎవరిని నియమించారనే దాని గురించి వివిధ ఉల్లేఖనాలు లభిస్తాయి. ఒక ఉల్లేఖనం ప్రకారం, పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో హ్రజత్ ముహమ్మద్ బిన్ మస్లమా రజియల్లాహు అన్హు ను తన అమీర్ (నాయకుడిగా) గా నియమించారు. దీనితో పాటు, హ్రజత్ సిబా బిన్ ఉర్ఫుతా రజియల్లాహు అన్హు , హ్రజత్ అలీ రజియల్లాహు అన్హు , హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె మక్తూమ్ రజియల్లాహు అన్హు పేర్లు కూడా లభిస్తాయి. దీనిని ఎలా అర్థం చేసుకోగలమంటే, ఈ నలుగురు వ్యక్తులు ఉప నాయకులుగా నియమించబడ్డారు, కానీ వారి బాధ్యతల్లో తేడా ఉండెను. ఇది చాలా సుదీర్ఘమైన ప్రయాణం అయినందున, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన కుటుంబ సభ్యుల సంరక్షణ మరియు గృహ అవసరాలను తీర్చడానికి హ్రజత్ అలీ రజియల్లాహు అన్హును మదీనాలోనే ఉండమని ఆదేశించారు. దాంబికుల పని ఎప్పుడూ దూషించడమే అయినందున ఈ విషయం గురించి మాట్లాడుతూ, "ఇతను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు భారం అయినందుకే ఆయన సల్లం ఇతన్ని తనతో పాటు తీసుకువెళ్ళలేదు" అని అన్నారు. ఈ దూషణలను విని లేదా చుట్టూ ఉన్న దాంబికులను చూసి, స్వయంగా భయపడి, హ్రజత్ అలీ రజియల్లాహు అన్హు ఆయుధం తీసుకుని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో హాజరయ్యారు. ఆయన సల్లం ఇంకా మదీనా నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జుర్ఫ్ స్థలంలోనే ఉండిరి. ఆయన (రజి) తన ఆందోళన, భయం గురించి వివరించినప్పుడు, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆయన (రజి)ను ఓదార్చుతూ ఒక వాక్యం చెప్పారు. అది ఆయన (రజి) గొప్పతనాన్ని, గౌరవాన్ని చాలా పెంచింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హ్రజత్ అలీ రజియల్లాహు అన్హుతో ఇలా అన్నారు: "ఓ అలీ! హారూన్, మూసా కొరకు ఎలా ఉండెనో నీవు నా కొరకు అలాగే ఉండటానికి సంతోషంగా లేవా? అయితే, నా తరువాత నీవు ప్రవక్త మాత్రం కాదు."

తబూక్ యుద్ధంలో పాల్గొన్న ముస్లింల సంఖ్య గురించి ఇలా వ్రాయబడింది: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధానికి సన్నాహాలు చేయడానికి అన్ని రకాల భౌతిక ఏర్పాట్లు చేసిన తర్వాత, దుఆ

వైపు దృష్టి సారించారు. తయారీ ప్రారంభం నుండి తబూక్ వైపు బయలుదేరే వరకు ఈ దుఆ చేస్తూనే ఉండిరి. اَللّٰهُمَّ اِنْ تُهْلَكْ هٰذِهِ الْعِصَابَةُ فَلَنْ تُعْبَدَ فِي الْاَرْضِ అనగా "ఓ అల్లాహ్! ఈ చిన్న సమూహం నాశనమైతే, ఈ భూమిపై నిన్ను ఆరాధించేవాడు ఎవరూ ఉండరు." ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మొట్ట మొదటి గజ్వా (యుద్ధం) అయిన బదర్ సమయంలో కూడా ఈ దుఆ ప్రస్తావన లభిస్తుంది, ఆయన సల్లం ఈ చివరి గజ్వా సందర్భంగా కూడా అదే దుఆ ప్రస్తావించబడింది.

ఏది ఏమైనప్పటికీ, తీవ్రమైన వేసవి కాలంలో, సుదీర్ఘ ప్రయాణం, అనేక ఇతర సమస్యలు మరియు కపటులు దుష్ప్రచారం చేసినప్పటికీ, ముప్పై వేల సంఖ్యలో ఒక గొప్ప సైన్యం సిద్ధమైంది. ఇందులో పది వేల మంది గుర్రపు సవారీలు ఉండిరి. ఇది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితంలో ఏ యుద్ధానికైనా అతిపెద్ద సైన్యం అయింది. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్ యుద్ధంలో అతిపెద్ద జెండాను హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్హు కు ఇచ్చారు. దీనితో పాటు హజ్రత్ జుబైర్ రజియల్లాహు అన్హు, హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ రజియల్లాహు అన్హు, హజ్రత్ అబూ దుజానా రజియల్లాహు అన్హు లేదా మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం హజ్రత్ మిహబ్ బిన్ ముంజిర్ రజియల్లాహు అన్హుకు కూడా జెండాలు ఇవ్వబడ్డాయి. తబూక్ యుద్ధం సందర్భంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మార్గదర్శకుడిగా అల్‌ఖమా బిన్ ఫగ్వా ఖుజాయీ, అతని తండ్రిని ఎంచుకున్నారు, వీరికి రహదారుల గురించి బాగా తెలుసు కావున త్వరగా సరైన మార్గం నుండి తీసుకెళ్లగలిగిరి. హజ్రత్ కఅబ్ బిన్ మాలిక్ రజియల్లాహు అన్హు ఇలా వివరించారు: మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్ యుద్ధం కోసం గురువారం బయలుదేరారు, ఆయన సల్లం గురువారం ప్రయాణించడానికి ఇష్టపడేవారు.

చివరగా, హుజూరె అన్వర్ ఇండోనేషియాలో సంస్థ మిషనరీ అయిన గౌ॥ గులాం ముహియుద్దీన్ సులైమాన్ గారు, తహ్రీక్ ఎ జదీద్ రబ్వా మాజీ నాయిబ్ వకీల్ అత్-తస్నీఫ్‌గా ఉన్న గౌ॥ డాక్టర్ ముహమ్మద్ షఫీక్ సెహగల్ గారు, అమెరికాకె చెందిన పర్వేజ్ మిన్హాస్ గారి భార్య గౌ॥ బుష్రా పర్వేజ్ మిన్హాస్ గారి సద్గుణాలను ప్రస్తావించి, వారి పరోక్ష అంత్యక్రియల ప్రార్థన చదివింతునని ప్రకటించిరి. మరణించిన వారి క్షమాపణ మరియు ఉన్నత స్థాయిల కొరకు హుజూరె అన్వర్ దుఆ చేశారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ
اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ
وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ
وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -